ప్రజాశక్తి

మంగళవారం 26 నవంబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు



విద్యార్థులకు దోమ తెరల పంపిణీ

ప్రజాశక్తి -అనంతగిరి:బాలికల పాఠశాల 1, 2 లలో విద్యార్థులకు అనంతగిరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారులు సోమవారం దోమతెరలు పంపిణీ చేశారు పాఠశాలలలో అధిక మంది విద్యార్థులు అనారోగ్యాలకు గురివుతుండడం పట్ల ప్రభుత్వం దోమతెరలు పంపిణీ చేశామని ఎంపీఎస్ఓ. నర్సింగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఆఫీసర్. బాబురావు, సిబ్బంది రామారావు, సింహాచలం పాల్గొన్నారు.



దోమతెరలు పంపిణీ చేస్తున్న స్థానిక వైద్య సిబ్బంది

మన్యం పసుపునకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తాం

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో గిరిజన రైతులు పండిస్తున్న పసుపునకు కాఫీ మాదిరిగానే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఉద్యానశాఖ, డిజిటల్ గ్రీన్ సంస్థల ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల సుస్థిర సాధికారత కోసం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సాంకేతిక శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీలో పండించే పసుపులో ఔషధ గుణాలున్నాయని, వాటి శాతాన్ని లెక్కించి అమ్మకాలు చేసే రైతులకు అధిక ధర పొందేందుకు వీలుంటుందన్నారు. దీనిపై రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ గ్రీన్ సంస్థ రాబోయే రెండు సంవత్సరాల్లో అరకు, పాడేరు, జి.మాడుగుల మండలాల్లోని 5వేల మంది పసుపు రైతులతో సాగులో సలహాలు, సూచనలు అందించేందుకు నిర్ణయించడం అభినందనీయమన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలన్నారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న పసుపులో కర్కుమిన్ పెంచడానికి కృషి చేయాలని చెప్పారు. పసుపులో నాణ్యత పెరిగితే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు.

ఉద్యానశాఖ జిల్లా అధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో లక్షా 50వేల ఎకరాల్లో కాఫీ, 75 వేల ఎకరాల్లో మిరియాలు, 25వేల ఎకరాల్లో పసుపు పండిస్తున్నారన్నారు. ఇప్పటికే కాఫీ, మిరియాల సాగును పెంచడంతో పాటు మార్కెటింగ్ చేసేందుకు ప్రత్యేక నెట్ వర్క్ ఉందన్నారు. ఇదే తరహాలో ఔషధ గుణాలు కలిగిన నాణ్యమైన పసుపు ఏజెన్సీలో పండుతున్నప్పటికీ. దానికి ప్రత్యేకమైన నెట్ వర్క్, మార్కెటింగ్ సదుపాయాలలేక రైతులు ధర విషయంలో నష్టపోతున్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన డిజిటల్ గ్రీన్ సంస్థ పసుపు పంటకు నెట్ వర్క్ తీసుకొచ్చేందుకు ముందుకొచ్చిందన్నారు. జిల్లాలోని మూడు మండలాల్లో ఐదు వేల మంది రైతులకు సంబంధించి పదివేల ఎకరాల్లో సాగు నుంచి మార్కెటింగ్ వరకు సలహాలు, సూచనలు చేసేందుకు నిర్ణయించిందన్నారు.

డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి నరేంద్ర మాట్లాడుతూ రైతులకు అవసరమైన వ్యవసాయ కార్యక్రమాలు ఈ సంస్థ ద్వారా చేపడుతున్నామన్నారు. భూసారం నుంచి మార్కెట్ స్థాయి వరకు వివిధ దశల్లో అవసరమైన సలహాలు, సూచనలను ఈ సంస్థ అందజేస్తుందన్నారు. జిల్లా ఉద్యానవనాధికారి రమేష్ కుమార్ రావు, స్పైసెస్ బోర్డ్ అధికారి కళ్యాణి, డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ హెడ్ నరేంద్ర, కాఫీ బోర్డు అధికారి రమేష్, ఎఫ్ పి ఓ ప్రతినిధి రాజేష్‌లను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నంద, రైతు సాధికార సంస్థ జిల్లా మేనేజరు భాస్కరరావు, డీఆర్డీఏ జిల్లా అధికారి మురళి, జిల్లా దాల్ సెంటర్ డాక్టర్ ప్రదీప్ కుమార్, స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ అధికారి కళ్యాణి, డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, సురేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఒ

ప్రతి విద్యార్థికీ అపార్ కార్డు ఉండేలా చర్యలు

-పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు :- రాష్ట్ర ప్రభుత్వం అపార్ నంబర్లపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో 11 మండలాల ఏ టి డబ్ల్యూ ఓ లు , ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అపార్ నెంబర్ల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఆధార్ నెంబర్ లో ఉన్న పుట్టిన తేదీ, పాఠశాలల్లో రికార్డుల్లో ఉన్న పుట్టిన తేదీని ఒకే విధంగా ఉండేలా సవరణలు చేయాలని చెప్పారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో 27 వేల మంది విద్యార్థులకు అపార్ట్ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ల జారిలో ఉన్న సమస్యలను తహసిల్దార్ దృష్టికి తీసుకుని వెళ్ళి పరిష్కరించాలని చెప్పారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎల్.రజని, 11మండలాల సహాయ గిరిజన సంక్షేమ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఐద్వా నేత పద్మావతి

మహిళలపై హింసను అరికట్టాలని ర్యాలీ

ప్రజాశక్తి-ఎటపాక

హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళలపై వివిధ రూపాల్లో జరుగుతున్న హింసను అరికట్టాలని కోరుతూ ఎటపాక మండలం గుండాల కాలనీలో జెడ్పీ హైస్కూల్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి ఐ.పద్మావతి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు రక్షణ కరువైందని, వీటికి కారణమైన మద్యం, మత్తు పదార్థాలు, డ్రగ్స్ నివారించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు మహిళలపైనా, విద్యార్థినులపైనా, పసి పిల్లలపైనా లైంగిక వేదింపులు, అత్యాచారాలు పెరిగి పోతున్నాయని, ఈ దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమాదేవి, జ్యోతి, మహిళా సంఘం నాయకులు సుమిత్ర, సావిత్రమ్మ, చిట్టెమ్మ, విజయకుమారి, శాంతి, శారద, శ్రీదేవి, జయ, రాధ, విద్యార్థినులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఉజ్జంగి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి స్థానిక పంచాయతీ సర్పంచ్, సర్పంచుల ల పోరం మండల అధ్యక్షుడు కే హరి సోమవారం పనుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం నుంచి పంచాయతీకి మంజూరైన నిధులతో అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, వార్డు సభ్యులు డుంబు నాయకులు జగన్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

30న పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ఈనెల 30వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన మేరకు ఈనెల 29వ తేదీ లోపు సంబంధిత మండల అధికారులు పించను మొత్తాలను డ్రా చేసి 30వ తేదీన పంపిణీకి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

గురుకుల అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ - పదో రోజుకు నిరసన దీక్ష

ప్రజాశక్తి-పాడేరు:- రాష్ట్రంలో గిరిజన గురుకులంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ డిమాండ్ చేశారు. ఐ టిడిఏ ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి మద్దతు తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాడేరు జిల్లా కేంద్రంలో గిరిజన గురుకులం అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు 10 రోజుల నుండి నిరసన దీక్ష చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం అన్యాయమన్నారు.అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తూ విద్యా ప్రమాణాలు పెంచుతున్నారన్నారు. గురుకుల పాఠశాల, కళాశాలల్లో 15ఏళ్ల నుండి విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ హామీ ప్రకారం పూర్తి స్థాయి ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా నియమించాలని డిమాండ్ చేశారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ లో గిరిజన గురుకులం ఉపాధ్యా పోస్టులు కలపడం గురుకుల సొసైటీ బైలకు నిర్వీర్యం చేయడమేనని గురుకులం సొసైటీ బైలాప్రకారం నియామకాలు చేపట్టాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షలో గిరిజన గురుకులం అవుట్ సోర్సింగ్ ఉపాధాయుల సంఘం జిల్లా నాయకులు రత్నాకుమార్,గణేష్,మత్స్యరాజు, వెంకటేశ్వరులు పోతురాజు భవానిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్



మద్యం షాపుల యజమానులతో మాట్లాడుతున్న శ్రీరామచంద్రమూర్తి

బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే రూ.5 లక్షల జరిమానా

ప్రజాశక్తి-రంపచోడవరం

మద్యం దుకాణాల నుండి బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే రూ.5 లక్షలు జరిమానా విధించడం జరుగుతుందని విశాఖపట్నం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి హెచ్చరించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.నాగ రాహుల్‌తో కలిసి సోమవారం శ్రీరామచంద్రమూర్తి రంపచోడవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సందర్శించారు. స్టేషన్ పరిధిలోని పది మద్యం షాపుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి, మద్యం అమ్మకాలు, మద్యం షాపుల సమయ పాలన, బెల్ట్ షాపులు గురించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తే మొదటిసారి రూ.5 లక్షల జరిమానా, రెండోసారి చేస్తే సదరు షాప్ లైసెన్స్‌ను రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. నాటు సారా, మద్యం అమ్మకాల పాత నేరస్థులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని రంపచోడవరం ఎక్సైజ్ సిఐని ఆదేశించారు. ఎవరి వద్ద అయినా నాటు సారా, అక్రమ బెల్ట్ షాపుల సమాచారం ఉంటే రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - చింతపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని భారత యువజన కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ మమతా నాగిరెడ్డి, ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు లు డిమాండ్ చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మోస్య ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన ఉద్యోగ భవన్లో నిర్వహించిన యువజన కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు శతక బుల్లిబాబు, ఏ పి సి సి ప్రధాన కార్యదర్శి పాచిపెంట శాంత కుమారితో కలిసి యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "నౌకరీ దో నసా నహి", "శక్తి అభియాన్" కార్యక్రమాలలో భాగంగా చింతపల్లిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మోడీ ప్రభుత్వం యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నమ్మ బలికిందన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను తుంగలో తొక్కాయన్నారు. నిరుద్యోగ సమస్యను నిర్మూలించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు కే.సూరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సాగిన కృష్ణ పడాల్, చిన్నస్వామి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి ముంచింగి పుట్టు :- మండలంలోని మాకవరం పంచాయతీ చత్తం గ్రామంలో మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందిస్తూ సోమవారం ఎంపీడీవో శ్రీ సాయి హర్ష గ్రామాన్ని సందర్శించారు. దట్టమైన అటవీ, కొండ ప్రాంతంలో కాలినడకన 5 కిలోమీటర్లు నడిచి గ్రామానికి చేరుకుని గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరు సంవత్సరాల క్రితం ఏడు కుటుంబాలు బాబు శాల పంచాయతీ ఏడుకొండలుబంధ నుండి వలస వచ్చి పోడు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నామని తెలిపారు. తమ గ్రామం పేరిట రేషన్ కార్డులు ,ఆధార్, జాబ్ కార్డులు లేవన్నారు. గ్రామానికి రహదారి, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామస్తుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లిపరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ వంతాల గంగాధర్, ఏపీఓ సంగంనాయుడు, ఈఓపిఆర్ డి చిన్నన్న, డిఎ నరేష్, వెల్ఫర్ అసిస్టంట్ మనోజ్, మహిళ పోలిస్ రోజారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ రామరాజు, వీఆర్ఏ ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -పెదబయలు: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మండలంలోని జమిగూడ, గోమాంగి, రూడకోట సంతల్లో కళాజాతా బృందం కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. యువత మంచి ప్రవర్తనతో నడిచి చదువుకోవాలన్నారు. మంచి భవిష్యత్ కోసం పాటు పడాలని సూచించారు.



ప్రదర్శన చేపడుతున్న కళాకారులు

మినీ వర్కర్‌కు ప్రమోషన్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్న సిడిపిఒపై చర్యలు తీసుకోవాలి

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేశ్వరి, నిర్మల

ప్రజాశక్తి-అడ్డతీగల

అడ్డతీగల ప్రాజెక్టు పరిధి, అడ్డతీగల సెక్టర్‌లో మినీ అంగన్వాడీ వర్కర్‌కు ప్రమోషన్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్న ఐసిడిఎస్ సిడిపిఒ సుధాపై చర్యలు తీసుకోవాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేశ్వరి, నిర్మల సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ/ సచివాలయంలో పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో మెయిన్ వర్కర్ పోస్టు ఖాళీ అయితే, ఆ పోస్టును ఆ కేంద్రం హెల్పర్‌తోనూ, ఆమెకు అర్హత లేకపోతే పక్కనే ఉన్న మినీ అంగన్వాడీ కేంద్రం వర్కర్‌కు ప్రమోషన్ ఇచ్చి ఆ పోస్టు భర్తీ చేయాలని ప్రభుత్వ జిఒ ఉందని తెలిపారు. అయితే అడ్డతీగల సెక్టర్ పరిధిలోని తిమ్మాపురం అంగన్వాడీ సెంటర్ మెయిన్ వర్కర్ చనిపోవడంతో ఆ పోస్టు ఖాళీ అయిందని, ఆ కేంద్రం హెల్పర్‌కు అర్హత లేనందున, పక్కనే ఉన్న డి.కిష్టవరం మినీ వర్కర్ ప్రభుత్వ జిఒ ప్రకారం తనకు ప్రమోషన్ ఇవ్వాలని సిడిపిఒ సుధాకు దరఖాస్తు ఇవ్వడానికి వెళ్లితే ఆ పోస్టు నీకు రాదని హేళనగా మాట్లాడి తిప్పి పంపించారని పేర్కొన్నారు. ఒక గిరిజన మినీ వర్కర్ తనకున్న అర్హత మేరకు ప్రమోషన్ కల్పించాలని అడుగుతున్నా ఆమెను ఆఫీస్ చుట్టూ తిప్పిస్తూ నేను ఇవ్వను ఏం చేసుకుంటారో చేసుకోండి అని సమాధానం ఇవ్వడం దుర్మార్గమన్నారు. మీరు తెచ్చే ఇలాంటి జీవోలు నేను వంద తెస్తానంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి ఆ వర్కర్‌ను మానసికంగా క్రుంగదీస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డి.కిష్టవరం మినీ వర్కర్‌కు ఉన్న అర్హతలను పరిగణనలోకి తీసుకొని ఆమెకు ప్రమోషన్ కల్పించి తిమ్మాపురం మెయిన్ వర్కర్‌గా నియమించాలని, గిరిజన మినీ వర్కర్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్న సిడిపిఓ సుధాపై చర్యలు తీసుకోవాలని రాజేశ్వరి, నిర్మల డిమాండ్ చేశారు.



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సిఐ నరసింహమూర్తి

గంజాయి రవాణాకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-వై.రామవరం

గంజాయి రవాణాకు గిరిజనులు దూరంగా ఉండాలని అడ్డతీగల సిఐ నరసింహమూర్తి అన్నారు. వై.రామవరం మండలం కేంద్రంలోని సంత మార్కెట్‌లో సోమవారం గంజాయి సాగు, రవాణా వల్ల అనర్థాలపై సంతకు వచ్చిన గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గిరిజనులు చెడు వ్యవహారాలకు దూరంగా ఉండాలని, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు చేరువ కావాలని సూచించారు. మారుమూల గ్రామాలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. గ్రామాలలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వారికి గంజాయి రవాణాకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వై.రామవరం ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సీలేరు

ఆదివాసీలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డీకే హిమబిందు అన్నారు. పిహెచ్‌సి పరిధి గుమ్మిరేవుల పంచాయతీ కాకనూరు గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో 98 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి హిమబిందు మాట్లాడుతూ వాతావరణంలో కలిగిన మార్పుల వల్ల గిరిజన గ్రామాల్లో వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు, చర్మవ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. శీతాకాలం కావడంతో ప్రజలు మంచులో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చలి నుండి రక్షణ కోసం ఉన్ని దుస్తులను ధరించాలని సూచించారు. చలి మంటలు పెట్టుకునే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జలుబు కారణంగా చిన్నపిల్లలు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు పడుతుంటారని, ఈ సమయంలో చిన్నారుల నాసిక రంధ్రాల్లో నాజల్ డ్రాప్స్‌గాని, ఉప్పునీటి ద్రావణ చుక్కలను గాని వేయాలని సూచించారు. గిరిజనుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలన్నారు. గర్భిణులు, బాలింతలు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో వాంతులు విరోచనాలతో తీవ్ర అస్వస్థత గురై నడవలేని స్థితిలో నున్న ఓ మహిళను అంబులెన్స్‌లో దారకొండ పిహెచ్‌సికి తరలించి మెరుగైన చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లోవకుమారి, ఏఎన్ఎం మత్స్యకొండ, సీత పాల్గొన్నారు.



గిరిజన మహిళకు ఆమె ఇంటి వద్ద వైద్యం అందిస్తున్న వైద్యాధికారి హిమబిందు

పాముకాటుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డబ్ల్యుయుసి టిఆర్ఇ ఎన్జీవో మద్రాస్ క్రోకోడైల్ బ్యాంక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాము కాటు, నివారణ అనే అంశంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్నేక్ కేచర్ వైల్డ్ వెంకట్ మాట్లాడుతూ మనకు కనిపించే అన్ని పాములు విషపూరితం కావని, పాముకాటుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాముకాటుకు గురికాకుండా, పాములు ఇళ్లల్లోకి చొరబడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి తెలియజేశారు. వన్యప్రాణులు అంతరించిపోతున్న నేపథ్యంలో వాటిని కాపాడవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు

పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారిణి డి.ఉమాదేవి ఆదేశించారు. మండలంలోని రావణాపల్లి రైతు సేవా కేంద్రంలో సోమవారం ఆమె వ్యవసాయ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరా రాజ్‌మా పంటకు రూ.300 చొప్పున రైతులు బీమా చేయించుకుంటే, ఏవైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించి, పంట నష్టపోయినప్పుడు రూ.20వేలు బీమా పొందవచ్చని చెప్పారు. రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ఉమాదేవి

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పెదబయలు : పాడేరులో డిసెంబర్ 4, 5న తేదీల్లో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బొండా సన్నిబాబు కోరారు.మండల కేంద్రంలో పార్టీ ఆఫీసులో పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కార్యాచరణను రూపొందించాలన్నారు.జిల్లా కేంద్రాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మారుమూల గిరిజన గ్రామాల్లో రోడ్లు, ఫోన్, రవాణా సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రత్యేక డిఎస్సి నిర్వహించాలన్నారు.బహు భాషా ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కిలో సర్వన్న, బుజ్జిబాబు, గంగాధరం, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా బోధనపై ఎంఇఒ ఆరా



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ చెల్లయ్య

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని కోట్నాపల్లి పంచాయతీ మత్స్యాపురంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి సోమేలి చెల్లయ్య సోమవారం తనిఖీ చేశారు. విద్యా బోధనలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.పాఠశాల నిర్వహణ రికార్డులను పరిశీలించారు. .ఉపాధ్యాయుడు డైరీ, ఇయర్, లెసన్ ప్లాన్ పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై తగు సూచనలు ఇచ్చారు. చక్కని విద్యాభ్యాసం అందిస్తున్న ఉపాధ్యాయులను సత్యారావు, తౌడం నాయుడులను అభినందించారు. అనంతరం చెల్లయ్య మాట్లాడుతూ, విద్యా వ్యవస్థ మెరుగునకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

చెక్ పోస్ట్ వద్ద రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ చెక్ పోస్ట్ వద్ద ఎదురెదురుగా వచ్చిన వాహనాలు ఢీ కొన్నాయి. అరకు నుండి ఎస్. కోటకు వెళ్తున్న బైక్, అరకు వెళ్తున్న మరో బైక్ ఢీకొన్నాయి. గాయపిన బాధితులను ఎస్. కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన బాధితులు

అభివృద్ధి పనుల సమాచారం ముందుగా చెప్పాలి

▸▸ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం తోనే అభివృద్ధి సాధ్యమని శాసనసభ్యులు రేగం మత్స్యలింగం తెలిపారు. ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. అభివృద్ధి పనులను ప్రారంభించే సమయంలో స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పీటిసి, ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచారం లేకుండా చేయడం సరికాదన్నారు. ప్రజా ప్రతినిధులు స్థానిక సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి వాటి పరిష్కారానికి నిధులు మంజూరు అయ్యేలా ప్రయత్నిస్తున్నప్పటికీ పనుల ప్రారంభం విషయంలో ప్రజా ప్రతినిధులకు భాగస్వామ్యం చేయకపోవడం సరికాదన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు చూసుకోవాలని తెలిపారు. గరుడిల్లి, ఎన్ఆర్ పురం పంచాయతీ రైతుల భూముల్లో పాటు ప్రభుత్వ భూములను భూస్వాములు కబ్జాకు పాల్పడుతున్నారన్నారు.ఇంజనీరింగ్ విభాగాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రోటోకాల్ విషయంలో పార్టీలకతీతంగా ప్రజలచే ఎన్నుకోబడ్డ నాయకులకే ప్రాధాన్యత ఇవ్వాలని కూటమి పేరుతో వచ్చే స్థానిక ప్రతినిధులకు ప్రాధాన్యత ఇవ్వాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే తో పాటు ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పిటిసి దీసరి గంగరాజు హెచ్చరించారు. మండలంలోని గిరిజనేతరుల ఆగడాలు అధికంగా ఉన్నాయని సభ్యులు మండిపడ్డారు. భూస్వాములకు అధికారులు వత్తాసు పలుకుతున్నారని, ఇటువంటివి కొనసాగిస్తే పెద్ద ఎత్తున నిరసన తెలియజేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు.భూ వ్యవహారాలకు అధికారులు సహకరించవద్దని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవిఐ కుమార్, తహసిల్దార్ మాణిక్యం, సిడిపిఒ అచ్యుత, జేఈలు గణేష్, సాయి విజయ్ గౌతమ్, డాక్టర్లు జ్ఞానేశ్వరి మంజు భార్గవి, పశు వైద్యాధికారి గణేశ్వరరావు, వైస్ ఎంపీపీ జయవర్ధన, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డులతో
ఓటు హక్కు వినియోగించుకోవాలి

▸▸ జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : రానున్న ఆంధ్ర ప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికలు 2024 సంబందించి ఓటరు గుర్తింపు కార్డు లేని వారు ప్రత్యామ్నాయంగా ఎన్నికల కమిషన్ గుర్తించిన ఇతర కార్డుతో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని, ఈ మేరకు ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారి చేసారని సోమవారం జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల నియోజకవర్గం నుండి జరిగే ఎన్నికలలో ఓటర్ల గుర్తింపు, భద్రతకు సంబంధించి సాధారణ ఎన్నికల నిబంధనలు సమానంగా వర్తిస్తాయన్నారు. ఈ నియోజక వర్గాలలోని ఓటర్లు కూడా అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓటర్లు అయినందున, వారికి ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డును గతం ఎన్నికల్లలో జారీ చేసామని తెలిపారు. చట్టపరమైన, వాస్తవిక స్థితిని పరిగణనలోకి తీసుకుని ఆంధ్ర ప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం ఓటర్లందరికి ఓటర్ గుర్తింపు కార్డు జారీ చేయబడిందన్నారు.ఓటర్ గుర్తింపు కార్డు లేకుంటే ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, పాస్పోర్ట్ , రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు లేదా ఇతర ప్రైవేట్ పారిశ్రామిక గృహాల ద్వారా ఉద్యోగులకు జారీ చేయబడిన సేవా గుర్తింపు కార్డులు, తదితర వాటితో ఓటు హక్కును వినియోగించుకోవచ్చునన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

పజాశక్తి పాడేరు :-వైద్యాధికారులు, వైద్య సిబ్బంది రోగులకు చికిత్స అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. జనరల్ ఆస్పత్రిలో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బంది ఖాళీలు, ఔషధ నిల్వలు, లేబరేటరీలు, ఆపరేషన్ థియేటర్ల పై సమీక్షించారు. ఆసుపత్రిలో ఉన్న మూడు అంబులెన్సులను సక్రమంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. ఇకమీదట అంబులెన్స్ నిర్వహణకు ఐటిడిఏ నిధులు చెల్లించదని స్పష్టం చేశారు. అంబులెన్స్ నిర్వహణకు ఆసుపత్రి నిధులు వినియోగించుకోవాలని సూచించారు. ఖాళీగా ఉన్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, సహాయక సిబ్బంది నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని చెప్పారు. ఆపరేషన్ థియేటర్లో మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆసుపత్రికి ప్రహరీ గోడ నిర్మిస్తామని పేర్కొన్నారు. ఆసుపత్రికి రోగులను చూడడానికి వస్తున్న వ్యక్తులకు పాసులు ఏర్పాటు చేయాలని, నిర్దిష్టమైన సమయంలోనే అనుమతించాలని సూచించారు.

అంబులెన్సుల డ్రైవర్లు అందుబాటులో లేకపోతే విధుల నుంచి తొలగించి వేరొకరిని నియమించుకోవాలని చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నెలకు రెండు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పాడేరు శాసనసభ్యులు విశ్వేశ్వరరాజు, అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్, ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ విశ్వామిత్ర, జిల్లా వైద్యానికి శాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



అనంతగిరిలో అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ కుమార్ ,తదితరులు

ప్రజాశక్తి -అనంతగిరి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనంతగిరి మండల కేంద్రంలోని వారపు సంతలో ప్లాస్టిక్ వస్తువులు, కవర్ల నిషేధం పై అవగాహన కల్పించామని ఎంపిడిఒ ఎవిఐ.కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపారస్తులు, ప్రజలు ప్లాస్టిక్ తో తయారు చేసిన వస్తువులు వాడరాదన్నారు.జ్యూట్ తో తయారు చేసిన సంచులు వాడాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులు వాడినా ,అమ్మిన వారిపై రూ 2000 రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి కార్యదర్శి సిఎస్ దేవా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నవరం సర్పంచ్ పాంగి సన్యాసిరావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో అంగన్వాడీ లు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బందితో కలిసి అన్నవరం వారపు సంతలో సోమవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పాటు అంగన్వాడీ లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చింతపల్లిలో అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ సన్యాసిరావు, సిబ్బంది

ఇళ్ల స్థలాల హామీ నెరవేర్చాలి

ప్రజాశక్తి -మధురవాడ : పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు ఇంటిస్థలాలను ఇచ్చి, ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం చేస్తామని ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. సోమవారం జివిఎంసి ఏడో వార్డు కళానగర్ నుండి 61వ సచివాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, సచివాలయ నిర్వాహక కార్యదర్శి కె నాయుడుకు వ్యక్తిగత దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ, అర్హులందరికీ ఇంటిస్థలాలు ఇవ్వడంతోపాటు పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణసాయం రూ.ఐదు లక్షలు ఇచ్చి పేదల సొంతింటి కలను సాకారం చేయాలని కోరారు. కాలనీల్లో రోడ్లు, విద్యుత్,ాతాగునీరు, డ్రైనేజీ పారుదల వంటి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి వి సత్యనారాయణ, ఎంఎస్ పాత్రుడు, డి కైలాష్, ఆర్ గురునాయుడు, సాయి, ఎన్ అఖిలేశ్వరి, జి పైదమ్మ, పి వెంకటి, జి ఎల్లయ్యమ్మ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో వన సమారాధన

ప్రజాశక్తి- కరాస: కార్తీక మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకొని మద్రిపాలెం రైతుబజార్‌లో రైతులు, వ్యాపారులు ఉమ్మడిగా కార్తీక వనభోజనాలు నిర్వహించారు.కార్యక్రమానికి విశాఖపట్నం జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి యాసిన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి కె. వరహాలు, సహాయకుడు ప్రతాప్, వార్డు ప్రెసిడెంట్ వాసుదేవరావు, కేబుల్ నాయుడు బుజ్జి,. సూర్యనారాయణ, సూర్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సాధిక్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఎస్ఐ సాధిక్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆన్లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సంబంధించిన వీడియోలు, సైబర్ క్రైమ్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సోషల్ మీడియాలో పరిచయాలు, ఆన్లైన్ వేధింపులు, ప్రేమ పేరుతో వలవేసి చేసే ఆర్థిక, శారీరక, మానసికంగా ఇబ్బందులు, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఈవ్ టీజింగ్, చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని, అవగాహనతోనే సైబర్ నేరాల బారిన పడకుండా ఉండగలమని చెప్పారు. విద్యార్థులంతా నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మద్యం సేవించే వాహనాలు నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి-దేవీపట్నం : మండలంలోని దేవారం గ్రామ సమీపంలో సారా బట్టీలపై సోమవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారు చేయడానికి సిద్ధంగా ఉన్న 200 లీటర్ల బెల్లం ఊటను, సామగ్రిని ధ్వంసం చేశామని, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. ఎవరైనా సారా కాసినా, అమ్మినా, రవాణా చేసినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. గ్రామ సమీపంలో ఎక్కడైనా సారాబట్టీలు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కొయ్యూరు : రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం యూ.చీడిపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను యూ.చీడిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హేమంత్ సందర్శించారు. పలువురు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తే, వ్యాధులకు దూరంగా ఉండొచ్చని సూచించారు.

అగ్ని ప్రమాదంలో తాటాకు ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చింతలపూడి గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన చిన్ని నూకరాజు అనే వ్యక్తికి చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇల్లు కాలి బూడిద కావడంతో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి-దేవీపట్నం : మండలంలోని కంబలంపాలెం జంక్షన్ వద్ద కార్తీక మాసం సందర్భంగా గుబ్బలంపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీ గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమవారం అన్న సమాధారన నిర్వహించారు. సుమారు 3000 మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

రాజవొమ్మంగి : శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భవన నిర్మాణ కార్మికులు, ఆలయ కమిటీ, గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఆదివారం 3వేల మందికి భారీ సమారాధన నిర్వహించారు. మండల నలుమూలాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

డిసిఎల్ తీరుపై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంజిఎం సెవెన్ హిల్స్ యాజమాన్యంతో డిప్యూటీ లేబర్ కమిషనర్ కుమ్మక్కయ్యారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఈ మేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో దశాబ్దాల తరబడి పనిచేస్తున్న కార్మికులను తొలగించి కాంట్రాక్ట్ పద్ధతిలో కొత్తవారిని యాజమాన్యం చేర్చుకుందని, ఇది చట్ట విరుద్ధమని, సీనియర్ కార్మికులను యధావిధిగా కొనసాగించాలని కోరారు. ఇదే విషయమై తాము కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదులు చేయగా, అందుకు సంబంధించిన ఫైల్‌ను డిసిఎల్ మాయం చేశారని ఆరోపించారు. సీనియర్ కార్మికులను అక్రమంగా తొలగిస్తే ఊరుకునేది లేదన్నారు. సమ్మె జరిగితే ఎంజిఎం సెవెన్ హిల్స్ యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. యాజమాన్యం అనుకూల విధానాలను కార్మిక శాఖ విడనాడాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్, కె.వరలక్ష్మి, పిలోనెహ, ఎ.జయలక్ష్మి, సిహెచ్.వెంకటలక్ష్మి, ఎ.లావణ్య పాల్గొన్నారు.

రహదారులిలా.. వెళ్లేదెలా.. ?

అడ్డురోడ్ నుంచి నర్సీపట్నం వరకు ప్రయాణికుల అవస్థలు
ఎక్కడికక్కడ పెద్దపెద్ద గుంతలు
పట్టించుకోని అయ్యన్న, అనిత
రాజాం - తట్టబంద రోడ్డూ అంతే..



అల్లుమియ్యంపాలెం జంక్షన్ వద్ద దెబ్బతిన్న రహదారి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, ఎస్.రాయవరం, కోటవురట్ల, బుచ్చయ్యపేట విలేకరులు

రాష్ట్ర ప్రభుత్వం రహదారుల బాగుపైనే దృష్టి పెట్టిందని సిఎం చంద్రబాబు చెప్పిన మాటలు జిల్లాలోని కీలకమైన కొన్ని రహదారుల విషయంలో కానరావడం లేదు. ఆయా చోట్ల రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడ్డురోడ్ నుంచి నర్సీపట్నానికి వెళ్లే ప్రధానమైన రహదారి దుర్భర స్థితికి అద్దం పడుతోంది. జిల్లాలో ఇద్దరు ప్రముఖులు ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గాల పరిధిలోని రహదారికావడంతో దీనికి మరింత ప్రాధాన్యత వుంది. ఎవరా గొప్పవాళ్లంటే.. నర్సీపట్నం నుంచి గెలిచిన శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట నుంచి ఎన్నికైన హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత. కానీ వీరిద్దరి నియోజకవర్గాల పరిధిలోని ఈ రహదారి మాత్రం అత్యంత అధ్వాన్నంగా ఉంది. సుమారు 34 కిలోమీటర్ల పొడవైన అడ్డు రోడ్ నుంచి నర్సీపట్నం రోడ్ 25 గ్రామాలకుపైగా ప్రజలకు ఉపయోగకరంగా వుంది. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ కేంద్రానికి, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల ప్రజలకు ఈ తారురోడ్డే దిక్కు. నర్సీపట్నం రైల్వే స్టేషన్, అచ్యుతాపురం బ్రాండిక్స్, నక్కపల్లి హెటిరో, పాయకరావుపేట మండలంలోని డెక్కన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు సంబంధించిన బస్సులు దీని మీదుగానే తిరుగుతున్నాయి. ఆటోలు, టూ వీలర్ల ప్రయాణికులతో నిరంతరం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు ఇదే ప్రధానాధారం. ఇంతటి ప్రధానమైన రహదారిలో ప్రయాణించడానికి భయపడేలా గుంతలున్నా అయ్యన్నపాత్రుడు, అనితకు పట్టినట్లులేదు. గెలిచిన తరువాత మొట్టమొదట అడ్డురోడ్ మరమ్మతులు చేపడతానని ఎన్నికల్లో అనిత హామీ ఇచ్చి గెలిచారుగానీ రోడ్డు మరమ్మతులు చేయించలేదు.



రాజాం కూడలిలో రాళ్లు తేలిపోయిన రోడ్డు

సంక్రాంతి నాటికి గుంతలులేని రహదారులు నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నవంబరు 2న పరవాడలో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో హామీ ఇచ్చారు. కానీ అడ్డురోడ్, నర్సీపట్నం రహదారి గుంతలు పూడ్చే పరిస్థితి కన్పించడంలేదు. పెద్దగుమ్ములూరు, ధార్లపూడి, ఇందేశమ్మ గుడి, అల్లుమియ్యంపాలెం జంక్షన్‌లో గోతులు భయంకరంగా వున్నాయి. వర్షం పడితే గోతుల్లో నీరుచేరి ప్రయాణించడానికి వీల్లేని విధంగా రహదారి వుంది. రోడ్డు మధ్యలో, పక్కల్లో పెద్ద గుంతలున్నాయి. దీంతో ఆటోలు తరుచూ పాడవుతున్నాయని డ్రైవర్లు వాపోతున్నారు. రోడ్లు, భవనాలశాఖ అధికారుల వద్ద రహదారి గుంతల పూడ్చివేత విషయం ప్రస్తావించగా కొద్ది రోజుల్లో రోడ్డు పనులను కాంట్రాక్టర్ ప్రారంభిస్తారని తెలిపారు. కొత్తగా మంజూరైన రోడ్డు పనులకు గుంతలు పూడ్చడానికి నిబంధనలు వర్తించవని గోతులు పూడ్చే పని ఆ శాఖ చేయడంలేదు. చేసిన పనులకు గతంలో బిల్లులు రాకపోవడంతో ఈ రహదారి పనులు చేయడానికి కాంట్రాక్టర్ ముందుకురాలేదు. దీంతో రహదారి సమస్య అలానే ఉంది.

రాజాం - తట్టబంద రహదారి విషయానికొస్తే..

బుచ్చయ్యపేట మండలంలోగల రాజాం - తట్టబంద రోడ్డులో పలుచోట్ల రోడ్డు ధ్వంసమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనకాపల్లి, రాజాం, తట్టబంద, రావికమతం ప్రాంతాల వాసులు ఈ రోడ్డు గుండా నిత్యం ప్రయాణాలు చేస్తుంటారు. జిల్లా కేంద్రానికి ఉపాధి పనుల నిమిత్తం వచ్చే వారి సంఖ్య ఎక్కువుగానే ఉంటుంది. ఈ రోడ్డు అంతా పెద్ద పెద్ద గుంతలతో ఉండటంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న మమతా నాగిరెడ్డి

నిరుద్యోగ సమస్యపై దేశ వ్యాప్త పోరాటం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో దేశంలో నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో త్వరలో పోరాటం చేపట్టనున్నామని అఖిలభారత యువజన కాంగ్రెస్ కార్యదర్శి మమతా నాగిరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మరాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ హయాంలో దేశ ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని, యువత తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉన్నారని తెలిపారు. దేశంలో గత పదేళ్లలో ఇవ్వాల్సిన 20 కోట్ల ఉపాధి ఎక్కడ ? అని ప్రశ్నించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు మాట్లాడుతూ విశాఖ పోర్టులో డ్రగ్స్ కంటైనర్ దొరికిందని, దానిపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి గౌతమ్ కుమార్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పిరిడి భగత్, కెవి.సూర్యనారాయణ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లిపిల్లి సతీష్ కుమార్, కాంగ్రెస్ తూర్పు నియోజకవర్గం అధ్యక్షురాలు దండి ప్రియాంక పాల్గొన్నారు.

డాక్టర్ మురళీ మోహన్‌కు ఐఎంఎ ప్రశంస

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరానికి చెందిన వైద్యులు డాక్టర్ ఎంవివి.మురళీమోహన్ జాతీయస్థాయి పురస్కారం, ప్రశంసలు అందుకున్నారు. గుంటూరులో ఆదివారం నిర్వహించిన ఐఎంఎ రాష్ట్ర స్థాయి సదస్సులో ఈ మేరకు డాక్టర్ మురళీమోహన్‌కు అవార్డును, ప్రశంసా పత్రాన్ని ఐఎంఎ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్‌వి.అశోకన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్, జె.నాయక్ అందజేశారు. రాజమండ్రికి చెందిన జిఎస్ఎల్ వైద్య కళాశాలలో నిర్వహించిన సెమినార్‌లో డాక్టర్ మురళీ మోహన్ 'భావితరాల వైద్యులు, ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు' అంశంపై ప్రసంగించిన తీరును ఐఎంఎ వైద్య ప్రముఖులు పలువురు ఈ సందర్భంగా ప్రశంసించారు.

ప్రహ్లాద కల్యాణ మండపంపై నిర్ణయం తీసుకోండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహారాణి పేటలో ఉన్న సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రహ్లాద కల్యాణ మండపాన్ని తక్షణమే సింహాచలం దేవస్థానానికి అప్పగించాలని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఇదే విషయంపై జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కూ వినతిని అందజేశారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ (టిసిఆర్ అండ్ టిఎం), గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్రంలో నిర్వహిస్తున్న గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు తలపెట్టిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు డాక్టర్ రాణి మంద పర్యవేక్షణలో జరగ్గా వివిధ జిల్లాల నుండి గిరిజన విద్యార్థులు హాజరయ్యారు. చిత్రలేఖనంకు ఆచార్య సింహాచలం, ఫైన్ ఆర్ట్స్ విభాగం, వ్యాసరచన పోటీలకు ఎన్‌పి.రాధిక, డ్యాన్స్ విభాగం, వక్తృత్వ పోటీలకు డాక్టర్ జోగారావు, డివి.మల్లికార్జునరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ఈ నెల 26న జరిగే జనజాతి గౌరవ్ దివస్ ముగింపు వేడుకలో బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు